ఉత్తరం
# కాకతీయ

TG TEL/25/A1234

www.kakatiyanews.com

శుక్రవారం, 11 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 27 | పేజీలు: 4 వెల: 5


## సంధ్యారావు సృష్టికర్త రేవంత్ రెడ్డే



మాదిగలకు సీఎం క్షమాపణ చెప్పాలి

డప్పును, మాదిగలను అవమానించారు

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు

3

## ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు
- రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



3

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591 కోట్లు

- ఆశ్రమ పాఠశాలల పండిట్లు, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై పరిశీలన
- అర్హులైన విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



2




# రూ.250 కోట్ల భూమి..
# ₹7 కోట్లకేనా?

## కొండల్‌రెడ్డి భూమి వద్ద బీఆర్ఎస్ సమరం

- కేటీఆర్ నేతృత్వంలో తుక్కుగూడకు ఎమ్మెల్యేలు
- అన్నదమ్ములకు వందల కోట్ల భూములా?
- ప్రజలకు సంక్షేమం చేయడానికి పైసల్లేవా?
- ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ మాయాజాలం
- ప్రభుత్వ భూముల కేటాయింపుపై కేటీఆర్ ప్రశ్నల వర్షం



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి టెస్సెరాక్ట్ కంపెనీ కోసం సుమారు రూ.250 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయించారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూమిని మార్కెట్ విలువకు కాకుండా ఇంత తక్కువ ధరకు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి

........(తరువాయి 2లో)

## డీటీసీ సార్.. ఏం మెసేజ్ ఇస్తున్నారు..?!

- ములుగు డీటీవో అక్రమాలపై మీ మౌనం కొమ్ముకాసేలా లేదా..?
- ఆధారాలతో సహా కాకతీయ వరుస కథనాలు
- అక్రమాలను బయటపెట్టినా విచారణేది..? చర్యలేవీ..?
- నీతులు, నిబంధనలు జనాలకేనా..? ఆర్టీఏ అధికారులకు వర్తించవా?
- ప్రశ్నలకు సమాధానమెందుకు ఇవ్వరు.. ఫోన్ చేస్తే లిఫ్ట్ ఎందుకు చేయరు..!
- ప్రజల పన్నులతోనే కదా మీరు జీతం తీసుకునేది..?!
- ములుగు జిల్లా కలెక్టర్ కలుగజేసుకోని విచారణ చేపట్టాలని జనాల డిమాండ్






3

అక్రమాలపై ఆధారాలతో వరుస కథనాలు.. అయినా ఉన్నతాధికారుల మౌనం! ములుగు రవాణా శాఖలో డీటీవో ఈశ్వర్ సింగ్ ఠాకూర్ విధుల్లో లేని సమయంలో ఆయన అధికారిక లాగిన్ ద్వారా ధ్రువపత్రాలు జారీ అయిన వ్యవహారంపై 'కాకతీయ' వరుస కథనాలు ప్రచురించినా.. ఇప్పటివరకు విచారణ జాడ కనిపించడం లేదు. లాగిన్‌ను ఎవరు వినియోగించారు? డిజిటల్ సంతకం ఎలా పనిచేసింది? ఎన్ని ధ్రువపత్రాలు జారీ అయ్యాయి? అన్న ప్రశ్నలకు సాంకేతిక రికార్డుల్లో సమాధానాలు ఉన్నా.. వాటిని పరిశీలించేందుకు అధికారులు ఎందుకు వెనుకాడుతున్నారన్నదే చర్చనీయాంశంగా మారింది. మరోవైపు సిబ్బంది వ్యవహారశైలి, ఇసుక లారీల తనిఖీలు, అక్రమ వసూళ్లపై వస్తున్న సమాచారంపైనా స్పందన లేకపోవడంతో డీటీసీ మౌనం ఎవరికి మేలు చేస్తోంది? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలకు నిబంధనలు చెప్పే రవాణా శాఖలోనే నిబంధనల ఉల్లంఘనలపై ఎందుకీ ఉదాసీనత? ములుగు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపిస్తారా?



ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్ గా నియమితులైన మధు యాష్కీ గౌడ్ గారికి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు.

## తెలంగాణ వాటా కృష్ణా జలాలు ఏపీకి

- నీళ్లు ఉండి పొలాలకు అందివ్వలేని దుస్థితి
- 35 టీఎంసీలు ఏపీకి.. తెలంగాణ ఎత్తింది 7 టీఎంసీలే
- పాలమూరు ప్రాజెక్టుల మోటార్లు బంద్ పెట్టారు
- కల్వకుర్తిలో 4,000 క్యూసెక్కుల సామర్థ్యానికి 700 క్యూసెక్కులే
- రైతుల ధర్నాలు కనిపించడం లేదా?
- ముఖ్యమంత్రి రేవంత్ పాలన ఘోర వైఫల్యం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు



**కాకతీయ, తెలంగాణబ్యూరో :** కండ్ల ముందు నీళ్లు పారుతున్నా పొలాలకు నీళ్లు ఇవ్వలేని పాలన ఇది.. పంటలను కాపాడలేని పరిస్థితి ఏర్పడింది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్‌రెడ్డి తెచ్చిన కరువు అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ

........(తరువాయి 2లో)

## ఏసీబీకి చిక్కిన ఇద్దరు

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, సీనియర్ అసిస్టెంట్ పట్టివేత
- సీఎంఆర్ఎఫ్ బిల్లు మంజూరుకు లంచం డిమాండ్
- రూ.2 లక్షల మంజూరుకు రూ.1.05 లక్షలు డిమాండ్
- రూ.లక్ష తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

3





3

## రెండో విడతలో 59 వేల ఇందిరమ్మ ఇళ్లు

- రూ.5 లక్షల ఉచిత సాయం దేశంలో ఎక్కడా లేదు
- పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



## ఉద్యోగులకు రూ.కోటి బీమా

### ప్రభుత్వంపై.. ఉద్యోగులపై రూపాయి భారం లేదు

### 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు

- ఇప్పటికే 98 క్లెయిమ్‌ల పరిష్కారం.. కోట్లలో చెల్లింపులు
- ప్రమాద మరణానికి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం
- విమాన ప్రమాదంలో రూ.2 కోట్ల వరకు బీమా
- ఉద్యోగుల కోసం హెల్త్‌కార్డు కూడా తెచ్చాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :**

ఉద్యోగి దురదృష్టవశాత్తూ మరణించినా ఆ కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకూడదనే మానవీయ ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.కోటి ప్రమాద బీమా పథకం దేశంలోనే తొలిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై రూపాయి కూడా ఆర్థిక భారం పడకుండా బ్యాంకుల సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు

........(తరువాయి 2లో)

# రూ.250 కోట్ల భూమి.. రూ.7 కోట్లకేనా?

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు కల్పించడం అధికార దుర్వినియోగం కాదా, ప్రయోజనాల సంఘర్షణ కాదా, కుటుంబ పాలన కాదా అని నిలదీశారు. ఈ భూకేటాయింపును నిరసిస్తూ గురువారం కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు తుక్కుగూడకు చేరుకుని భూమిని పరిశీలించారు. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




**రూ.250 కోట్ల భూమి.. రూ.7 కోట్లకే ఎలా?**

ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..! ముఖ్యమంత్రి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి కేటాయించిన భూమి విలువ సుమారు రూ.250 కోట్లు ఉంటే కేవలం రూ.7 కోట్లకే ఎలా ఇచ్చారని కేటీఆర్ ప్రశ్నించారు. భూకేటాయింపునకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను మార్కెట్ విలువకు కాకుండా తక్కువ ధరకు కేటాయించడంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. మరోవైపు అనుముల జగదీశ్వర్‌రెడ్డికి సంబంధించిన సంస్థకు రూ.1,000 కోట్ల పెట్టుబడి పేరుతో ప్రభుత్వ రాయితీలు, భూములు, మినహాయింపులు కల్పించే వ్యవహారంపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. ఒకవైపు ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి.. మరోవైపు పారిశ్రామికవేత్త అనుముల జగదీశ్వర్‌రెడ్డి.. ఇద్దరి మధ్య రూ.1,000 కోట్ల పెట్టుబడి ఒప్పందం.. దానికి మళ్లీ ప్రభుత్వ రాయితీలు, భూములు, మినహాయింపులు ఇవ్వాలా అని నిలదీశారు.

**అన్నదమ్ములకు వందల కోట్ల ప్రయోజనాలా?**

ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు, పెట్టుబడి ప్రయోజనాలు కల్పించడం అధికార దుర్వినియోగం కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇది కుటుంబ పాలన కాదా, ప్రయోజనాల సంఘర్షణ కాదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి సోదరుడి సంస్థ ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌తో చేసుకున్న ఒప్పందంపైనా ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రూ.250 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయించిన వ్యవహారంపై బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈడీ, ఐటీ, సీబీఐలు ప్రతిపక్షాలపై కేసులు పెట్టడానికే ఉన్నాయా? అధికారంలో ఉన్నవారి వ్యవహారాలు ఎందుకు కనిపించడం లేదని నిలదీశారు. తెలంగాణ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందని ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఆరోపిస్తున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణను కొల్లగొడుతున్నారని ఆరోపిస్తున్నప్పుడు దొంగలను పట్టుకోవాల్సిన కేంద్ర హోంమంత్రి ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఇంత పెద్ద భూకేటాయింపు వ్యవహారం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు లోబడి ఉంటాయని కేటీఆర్ అన్నారు. ఈ రంగాల్లోనూ అధికారానికి దగ్గరగా ఉన్న కుటుంబాలకు ప్రయోజనాలు కల్పిస్తున్నారన్న అంశంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలు ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలోకి రావడంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు.

**సభలో గొంతు నొక్కారు.. అందుకే ఇక్కడికి వచ్చాం**

శాసనసభలో భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిస్తామనే తమను సస్పెండ్ చేసి బయటకు పంపారని కేటీఆర్ అన్నారు. సభలో తమ గొంతు నొక్కారని, ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తామనే భయంతోనే బయటకు పంపారని విమర్శించారు. అందుకే ముఖ్యమంత్రి సోదరుడికి కేటాయించిన భూమి వద్దకు వచ్చి ప్రజల తరపున ప్రశ్నిస్తున్నామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాయాజాలం నడుపుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. గతంలో ఫార్మాసిటీ కోసం నిర్దిష్ట షరతులతో భూసేకరణ జరిగిందని, ఆ భూములను ఇప్పుడు ఇతర కార్యకలాపాలకు వినియోగించడం చట్టపరంగా ప్రశ్నార్థకమని అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు ఈ న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

**పెట్టుబడిదారులు బలిపశువులు కావొద్దు**

ఫ్యూచర్ సిటీ భవిష్యత్తుపై న్యాయపరమైన చిక్కులు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. భవిష్యత్తులో కోర్టుల్లో ఈ భూములపై వివాదాలు తలెత్తితే నష్టపోయేది పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తలేనని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ ప్రయోజనాల కోసం జరుగుతున్న రియల్ ఎస్టేట్ వ్యవహారంలో పెట్టుబడిదారులు బలిపశువులు కావద్దని సూచించారు. ప్రభుత్వం నిజంగా పారదర్శకంగా వ్యవహరిస్తే సామాన్యులు, యువత, రైతులకు కూడా ఇదే తరహాలో ప్రభుత్వ భూములు, రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము రూ.1 లక్ష మూలధనంతో పెట్టుబడి పెడతామని వస్తే రూ.200 కోట్ల విలువైన స్థలం ఇస్తారా? తమకూ అదే రాయితీలు, మినహాయింపులు ఇస్తారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**ప్రతి గ్రామంలో సదస్సులు**

ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలిపెట్టబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. అవసరమైతే ప్రజా కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహించి భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ పేరుతో జరుగుతున్న వ్యవహారాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. అవసరమైన అన్ని న్యాయ, ప్రజాస్వామ్య మార్గాలను అన్వేషించి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం చూపిస్తున్న రంగుల కల వెనుక ఉన్న న్యాయపరమైన అంశాలను కూడా మీడియా ప్రజలకు వివరించాలని కేటీఆర్ కోరారు. భవిష్యత్తులో పెట్టుబడిదారులు నష్టపోయే అవకాశం ఉన్న అంశాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సొమ్ము, ప్రభుత్వ భూముల విషయంలో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాల్సిందేనని పేర్కొంటూ.. ఈ భూవ్యవహారంపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.



# ఉద్యోగులకు రూ.కోటి బీమా

(మొదటిపేజీ తరువాయి)

ఈ పథకం వర్తిస్తోందన్నారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగుల ప్రమాద బీమా, హెల్త్‌కార్డులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ బీమా పథకం పరిధిలో ఉన్నారని భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారని చెప్పారు. 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారని వివరించారు. మరో 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఈ పథకం కింద ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మొత్తం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని ఉద్యోగులకు బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో సర్క్యులర్ జారీ చేసిందని చెప్పారు. పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో స్పష్టంగా పేర్కొన్నట్లు వివరించారు.

**సింగరేణిలో శ్రీకారం**

ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టామని భట్టి తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ పథకాన్ని విస్తరించామని చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు వివరించారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి బీమా పథకాన్ని అమలు చేస్తోందని భట్టి విక్రమార్క చెప్పారు. ఉద్యోగుల జీతాలు ఆయా బ్యాంకుల ద్వారానే జమ అవుతున్నందున బ్యాంకులకు వ్యాపారపరంగా ప్రయోజనం కలుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల కోసం బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నామని వివరించారు. దీంతో ప్రభుత్వంపై కానీ, ఉద్యోగులపై కానీ ప్రీమియం రూపంలో ఎలాంటి ఆర్థిక భారం లేదని స్పష్టం చేశారు. ఉద్యోగి కుటుంబానికి ఆపద సమయంలో ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు.

**98 క్లెయిమ్‌లు పరిష్కారం**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయని, అందులో 24 క్లెయిమ్‌లను పరిష్కరించామని భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా, అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా, వాటన్నింటినీ పరిష్కరించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విద్యుత్ సంస్థలు, సింగరేణి పరిధిలో కలిపి ఇప్పటివరకు 98 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు వివరించారు. ప్రమాదవశాత్తూ ఉద్యోగి మరణిస్తే ఆయన కుటుంబానికి రూ.కోటి బీమాతో పాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం లభించే వెసులుబాటు ఉందన్నారు. సహజ మరణానికి కూడా రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే అవకాశం ఉందని చెప్పారు. ఉద్యోగి కుటుంబం ఒక్కసారిగా ఆదాయాన్ని కోల్పోయిన సమయంలో వారికి ఆర్థిక భరోసా అందించడమే ఈ పథకం లక్ష్యమని తెలిపారు. దేశంలోనే ప్రత్యేకమైన విధానంగా తెలంగాణలో అమలు చేస్తున్న ఈ పథకాన్ని ఇతర ప్రభుత్వాలు కూడా పరిశీలిస్తున్నాయని చెప్పారు.

**కేంద్రం కూడా అధ్యయనం చేసింది**

తెలంగాణలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా అధ్యయనం చేసిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఇదే తరహా పథకాన్ని అమలు చేసినట్లు వెల్లడించారు. ప్రమాద బీమా పథకంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చామని భట్టి విక్రమార్క తెలిపారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చించిన అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేశామని వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రమాద బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు.. ఈ రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని శాసన సభకు వివరించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591 కోట్లు

- ఆశ్రమ పాఠశాలల పండిట్లు, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై పరిశీలన
- అర్హులైన విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591.62 కోట్లుగా ఉన్నాయని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. గురువారం శాసనమండలిలో సభ్యులు తీన్మార్ మల్లన్న, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యం నెలికంటి తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసి సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయన్న ప్రశ్నకు మంత్రి స్పందించారు. అలాంటి పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యల అంశం ఉత్పన్నం కాదన్నారు.

**ఆశ్రమ పాఠశాలల సిబ్బందిపై సానుకూల నిర్ణయం**

ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్లు, పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా రంగ సమస్యల పరిష్కారంతో పాటు ఆశ్రమ పాఠశాలల సిబ్బంది సమస్యలపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు.



# పంచాయతీలకు ఆర్థిక స్వాతంత్ర్యం

- సొంత ఆదాయాన్ని నేషనల్ బ్యాంకుల్లో జమ చేసుకునేలా సవరణ
- 15వ ఆర్థిక సంఘం నిధుల పెండింగ్ త్వరలో విడుదల
- ఎన్నికలు జరగని గ్రామాలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు : మంత్రి సీతక్క

**కాకతీయ, హైదరాబాద్ :** గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించేందుకే పంచాయతీరాజ్ చట్టం-2018ను సవరించామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. పంచాయతీలు తమ సొంత ఆదాయాన్ని సమీపంలోని నేషనల్ బ్యాంకులో జమ చేసుకునేలా చట్ట సవరణ చేశామని తెలిపారు. ఇప్పటివరకు పంచాయతీల సొంత ఆదాయం రాష్ట్ర ట్రెజరీలో జమ అవుతోందని వివరించారు. శాసనసభలో బుధవారం మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లుపై గురువారం చర్చ జరిగింది. అనంతరం సభ్యులందరి ఏకగ్రీవ మద్దతుతో బిల్లు ఆమోదం పొందింది. ఈ మార్పుతో గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. గత 2 సంవత్సరాలుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని సీతక్క తెలిపారు. ఎన్నికల అనంతరం పెండింగ్ నిధులు విడుదల అవుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం నుంచి దాదాపు రూ.700 కోట్ల నిధులు రావాల్సి ఉందని చెప్పారు. 2018లో స్టాంప్ డ్యూటీని తొలగించడం వల్ల స్థానిక సంస్థలు కొంత ఆర్థిక సంక్షోభంలో పడ్డాయని వివరించారు. గ్రామ పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నామని, పంచాయతీరాజ్ శాఖ నుంచి సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న నిధులు ఏమీ లేవని స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో పనులు పూర్తిచేసి పంచాయతీరాజ్ శాఖను నిధుల కోసం అడుగుతున్నారని తెలిపారు. వివాదాల కారణంగా ఎన్నికలు జరగని గ్రామాలకు కూడా తెలంగాణ ప్రభుత్వం నిధులు అందిస్తోందని మంత్రి సీతక్క సభలో వెల్లడించారు.

# వెయ్యి రోజుల పాలనపై ప్రజలకు వివరించాలి

- బీఆర్ఎస్ కుట్రను తిప్పికొట్టిన సభ్యులకు అభినందనలు
- ఎమ్మెల్యేలు సభకు క్రమం తప్పకుండా హాజరుకావాలి
- ఓటు హక్కు పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలి : సీఎం రేవంత్‌రెడ్డి



**కాకతీయ, హైదరాబాద్ :** ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరించేందుకే సభను నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభ సజావుగా సాగకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసిందని ఆరోపించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎల్పీ సమావేశం నిర్వహించి సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు. అధికారం కోల్పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నేతలు పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులను దూషిస్తూ 3 రోజులు సభను అడ్డుకున్నారని విమర్శించారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బందులకు గురిచేశారని, శాసనసభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారని మండిపడ్డారు. ప్రతిపక్ష కుట్రను తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలను వివరించిన సభ్యులను అభినందించారు. ఎమ్మెల్యేలు తప్పనిసరిగా సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలని, హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. నియోజకవర్గ సమస్యలను సభలో ప్రస్తావించాలని అన్నారు. కాంగ్రెస్ నుంచి ఎదిగి పార్టీకి నష్టం చేకూర్చాలని కొందరు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ప్రశ్నించారు. కులగణనలో తెలంగాణ నమూనా దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిందని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, ఎమ్మెల్యేలంతా ఓటు హక్కు పరిరక్షణను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు, ప్రవర్తనే భవిష్యత్ గెలుపోటములను ప్రభావితం చేస్తాయని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణ వాటా కృష్ణా జలాలు ఏపీకి

(మొదటిపేజీ తరువాయి)

డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. పాలమూరు బిడ్డను అని విర్రవీగే రేవంత్‌రెడ్డి కృష్ణా జలాలు ఎత్తకుండా పాలమూరు ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారని విమర్శించారు. పాలమూరు పులి అంటూ నీటి వినియోగంలో మాత్రం పిల్లిలా ఉన్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రైతాంగానికి నీళ్లు నిల్లు.. ఏపీ రైతాంగానికి నీళ్లు ఫుల్లు అన్నట్టుగా పరిస్థితి మారిందని ఆరోపించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ఎల్లూరు పంప్‌హౌస్‌లో 5 మోటార్లు 24 గంటలు నడపాల్సి ఉండగా కేవలం 2 మోటార్లే నడుస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. అవి కూడా ఆన్ అండ్ ఆఫ్‌గా నడుస్తున్నాయని, సగటున రోజుకు 11 గంటలే మోటార్లు పనిచేస్తున్నాయని చెప్పారు. రోజుకు 1600 క్యూసెక్కులు రావాల్సిన చోట 700 క్యూసెక్కులే వస్తున్నాయని, 4000 క్యూసెక్కులు ఎత్తగలిగే సామర్థ్యం ఉన్నా ప్రభుత్వం కేవలం 700 క్యూసెక్కులే ఎత్తుతోందని విమర్శించారు. బీమా ప్రాజెక్టులో 3 మోటార్లకు ఒకటి, నెట్టెంపాడులో 4 మోటార్లకు ఒకటి, కోయిల్‌సాగర్‌లో 3 మోటార్లకు ఒకటి మాత్రమే నడుపుతున్నారని తెలిపారు. ఎల్‌నినో ప్రమాదం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో వచ్చిన నీటిని వచ్చినట్లుగా ఎత్తాల్సి ఉండగా.. ఎత్తగలిగే అవకాశం ఉండి కూడా మోటార్లు బంద్ పెట్టారని విమర్శించారు. బేసిన్‌లో లేని వెలిగొండ ద్వారా చంద్రబాబు నీళ్లు తీసుకుపోతుంటే.. బేసిన్‌లో ఉన్న, కృష్ణా జలాల కేటాయింపు ఉన్న బీమా ప్రాజెక్టును ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు.

**బాబు గారికి గురుదక్షిణా?**

పాలమూరు ప్రాంతంపై రేవంత్‌రెడ్డికి ఉన్న ప్రేమ వట్టి మాటలేనని హరీశ్‌రావు విమర్శించారు. బాబు గారికి గురుదక్షిణ చెల్లించుకుంటున్నారా? వెలిగొండ, పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్లు తరలించుకుపోయేందుకు సహకరిస్తున్నారా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం వల్ల తెలంగాణ వరప్రదాయినిగా ఉన్న కృష్ణా జలాలు ఏపీకి వరప్రదాయినిగా మారాయని ఆరోపించారు. పాలమూరు, నల్లగొండ జిల్లాల ప్రజలు సాగు, తాగునీటి కోసం తండ్లాడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో రైతులు అర్ధనగ్న ప్రదర్శనలు, పొంగులేటి నియోజకవర్గంలో రైతులు ధర్నాలు చేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా సబ్‌స్టేషన్ల ముందు రైతులు నీళ్ల కోసం ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. కల్వకుర్తికి గత 30 ఏళ్లలో 13 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 3.07 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని హరీశ్‌రావు అన్నారు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు రూ.4000 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేసి ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని చెప్పారు. శ్రీశైలంలో తెలంగాణకు ఉన్నవి కల్వకుర్తి, పాలమూరు ప్రాజెక్టులేనని, పాలమూరు ప్యాకేజీ3 పనులను నెల రోజులు కష్టపడితే పూర్తి చేయవచ్చని అన్నారు. మూడేళ్లుగా ఆ పని చేయడం లేదని, ప్యాకేజీ పూర్తయితే 5-6 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయని చెప్పారు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టు కావడంతో ఆయనకు కీర్తి వస్తుందనే ఉద్దేశంతోనే పాలమూరు ప్యాకేజీని పడావు పెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు.

**ఏపీకి 35 టీఎంసీలు.. తెలంగాణకు 7 టీఎంసీలు**

అధికారిక లెక్కల ప్రకారం శ్రీశైలం నుంచి ఏపీ 35 టీఎంసీల నీటిని తీసుకుపోయిందని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ మాత్రం 7 టీఎంసీలు మాత్రమే ఎత్తుకుందని చెప్పారు. 2024-25లో కృష్ణా జలాల వినియోగం 28.49 శాతం, 2025-26లో 25.77 శాతానికే పరిమితమైందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ మూడేళ్లలోనే అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం జరిగిందని, ఉన్న తాత్కాలిక వాటాను కూడా వాడుకోలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. 6 లక్షల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించిన చేవలేని ప్రభుత్వం ఇదేనని మండిపడ్డారు. బీఆర్ఎస్ పోరాటం చేసిన తర్వాతే సాగర్‌కు కొద్దికొద్దిగా నీళ్లు ఇస్తున్నారని, బీఆర్ఎస్ నిలదీస్తే తప్ప ప్రభుత్వం మొద్దు నిద్ర వీడదా? అని ప్రశ్నించారు. బేసిన్‌లో లేని వెలిగొండకు నీళ్లు.. బేసిన్‌లో ఉన్న మహబూబ్‌నగర్‌కు నీళ్లు లేని పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**సస్పెన్షన్లు కాదు.. మోటార్లు ఆన్ చేయాలి**

అసెంబ్లీలో ప్రజల తరపున మాట్లాడితే మార్షల్స్ పెట్టి బీఆర్ఎస్ సభ్యులను బయటకు పంపించారని హరీశ్‌రావు అన్నారు. మమ్మల్ని కాదు.. మోటార్లు ఆన్ చేసి కృష్ణా నీళ్లు ఎత్తండి రేవంత్‌రెడ్డి అని సూచించారు. రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించినట్లుగా ప్రభుత్వం సస్పెన్షన్ల బిజీలో ఉందని విమర్శించారు. రైతులకు కావాల్సింది బూతులు కాదని, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు కాదని.. పంపులకు పవర్, పొలాలకు సాగునీరు కావాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రకృతి వైపరీత్యం కావచ్చని, అయితే నీరు అందుబాటులో ఉండి కూడా రైతులకు అందించకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి మౌనం తెలంగాణ తాగు, సాగునీటి ప్రయోజనాలకు శాపంగా మారుతోందని విమర్శించారు. ఏపీ నీటి తరలింపునకు వెంటనే అడ్డుకట్ట వేయాలని, అవసరమైతే అపెక్స్ కౌన్సిల్‌ను డిమాండ్ చేయాలని హరీశ్‌రావు కోరారు. పాలమూరు అన్ని ప్రాజెక్టుల మోటార్లను ఆన్ చేసి పొలాలకు నీళ్లు ఇవ్వాలని, సాగర్ కాల్వకు నీళ్లు విడుదల చేసి నల్లగొండ పొలాలకు మళ్లించాలని డిమాండ్ చేశారు.

**నిజామాబాద్‌లోనూ లిఫ్టులు బందే**

బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వేముల ప్రశాంత్‌రెడ్డి: నిజామాబాద్ జిల్లా రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, పరిస్థితులు బాగాలేవని అసెంబ్లీలో మాట్లాడాలని రైతులు ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. రైతుల సమస్యలను సభలో ప్రస్తావిస్తామని అడిగినందుకు తమను అన్యాయంగా సస్పెండ్ చేశారని అన్నారు. వర్షాల కారణంగా ఎస్సారెస్పీలో 46 టీఎంసీల నీళ్లు ఉన్నాయని, గుత్ప, అలీసాగర్ లిఫ్టులు ప్రారంభించి చెరువులు నింపాలని డిమాండ్ చేస్తే తూతూమంత్రంగా గుత్ప లిఫ్టులు ఆన్ చేశారని విమర్శించారు. 4 మోటార్లకు ఒక్క మోటారే నడుపుతున్నారని, వెంటనే పూర్తి స్థాయిలో గుత్ప లిఫ్టును నడిపి అన్ని చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. అలీసాగర్ సామర్థ్యం 720 క్యూసెక్కులు కాగా 4 మోటార్లకు సగమే నడుపుతున్నారని, అవి కూడా ఆన్ అండ్ ఆఫ్‌గా నడుస్తున్నాయని చెప్పారు. గుత్ప, అలీసాగర్ కలిపి రోజుకు 1260 క్యూసెక్కులు నడిపితే నెల రోజుల్లో 3 టీఎంసీలు మాత్రమే అవుతాయని, తద్వారా ఉన్న చెరువులన్నీ నింపవచ్చని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలోని లక్ష్మి కెనాల్‌కు నిండుగా నీళ్లు ఇవ్వాలని, చౌటుపల్లి హన్మంతరెడ్డి లిఫ్టుతో పాటు ఇతర అన్ని లిఫ్టులను వెంటనే ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించాలని వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## రైతుకు కావాల్సింది పవర్ పాయింట్ కాదు

నీళ్లు ఉండి ఎత్తలేని పరిస్థితి, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉండి కరెంట్ ఉత్పత్తి చేయని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని హరీశ్‌రావు విమర్శించారు. యాదాద్రి పవర్‌ప్లాంట్, భద్రాద్రి కొత్తగూడెం సోలార్ వంటి ప్రాజెక్టులు తీసుకొచ్చినా వాటిని సక్రమంగా నడపడం లేదన్నారు. కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల ప్లాంట్‌ను, 540 మెగావాట్ల బీటీపీఎస్ యూనిట్లు 3, 4ను మూసేశారని చెప్పారు. యాదాద్రిలో 4000 మెగావాట్ల సామర్థ్యానికి 2000 మెగావాట్లే ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. ఒకవైపు బొగ్గు సర్‌ప్లస్‌గా ఉందంటూ.. మరోవైపు యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేయడం లేదని విమర్శించారు. మూడేళ్లలో ఒక్క ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ కూడా నిర్మించలేదని, రైతులకు ఇచ్చే పవర్ లేదని.. ప్రతిపక్షాల పీక నొక్కడానికి మాత్రం పవర్ ఉందని ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాడు కరెంట్ లేదని విమర్శలు చేశారని, ఇప్పుడు 7 గంటలు కూడా కరెంట్ రావడం లేదని అన్నారు. లాగ్‌బుక్స్ ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించారు.

# డీటీసీ సార్.. ఏం మెసేజ్ ఇస్తున్నారు..?!

- ములుగు డీటీవో అక్రమాలపై మీ మౌనం కొమ్ముకాసేలా లేదా..?
- ఆధారాలతో సహా కాకతీయ వరుస కథనాలు
- అక్రమాలను బయటపెట్టినా విచారణేది..? చర్యలేవీ..?
- నీతులు, నిబంధనలు జనాలకేనా..? ఆర్టీఏ అధికారులకు వర్తించవా?
- ప్రశ్నలకు సమాధానమెందుకు ఇవ్వరు.. ఫోన్ చేస్తే లిఫ్ట్ ఎందుకు చేయరు..!
- ప్రజల పన్నులతోనే కదా మీరు జీతం తీసుకునేది..?!
- ములుగు జిల్లా కలెక్టర్ కలుగజేసుకోని విచారణ చేపట్టాలని జనాల డిమాండ్




**కాకతీయ, తెలంగాణ బ్యూరో / ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లా రవాణా శాఖలో చోటుచేసుకుంటున్న వరుస వ్యవహారాలపై 'కాకతీయ' ఆధారాలతో సహా కథనాలు ప్రచురిస్తున్నా.. శాఖ ఉన్నతాధికారుల స్పందన మాత్రం మౌనానికే పరిమితమవుతోంది. ముఖ్యంగా జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) ఈశ్వర్ సింగ్ ఠాకూర్ విధుల్లో లేని సమయంలో ఆయన అధికారిక లాగిన్ ద్వారా ధ్రువపత్రాలు జారీ అయిన అంశం తీవ్ర చర్చకు దారితీసింది. అధికారి కార్యాలయంలో లేకపోతే ఆయన లాగిన్ ఎలా పనిచేసింది? ఆ లాగిన్‌ను ఎవరు వినియోగించారు? డిజిటల్ సంతకం ఎలా ఉపయోగించారు? ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారా? అప్పగిస్తే ఆ ఉత్తర్వులు ఎక్కడ? వంటి కీలక ప్రశ్నలు తలెత్తుతున్నా.. వాటికి సమాధానాలు చెప్పాల్సిన డీటీసీ ఎందుకు మౌనంగా ఉన్నారన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న.

**విధుల్లో లేకుండానే ధ్రువపత్రాలా..?**

ఇటీవల అక్టోబర్ 2న ములుగు జిల్లా రవాణా శాఖ అధికారి ఈశ్వర్ సింగ్ ఠాకూర్ కోర్టు పనిమీద నిర్మల్ జిల్లాకు వెళ్లిన సమయంలో ములుగు కార్యాలయంలో ఆయన లాగిన్‌పై కొన్ని ధ్రువపత్రాలు జారీ అయినట్లు సమాచారం. అధికారి ఒకచోట.. ఆయన అధికారిక లాగిన్ మరోచోట పనిచేసిందా? ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్, ఫిట్‌నెస్ వంటి కీలక ధ్రువపత్రాల జారీకి ఉపయోగించే లాగిన్, డిజిటల్ సంతకం విషయంలో ఇంత నిర్లక్ష్యం ఎలా సాధ్యమైంది? అధికారి విధుల్లో లేని సమయంలో జరిగిన లావాదేవీలపై కనీసం ప్రాథమిక విచారణ చేయాల్సిన బాధ్యత డీటీసీకి లేదా? నిబంధనలు పాటించామని చెబితే.. ఆ రోజు హాజరు రికార్డు, లాగిన్ లాగ్, జారీ చేసిన ధ్రువపత్రాల వివరాలు బయటపెడితే నిజం తేలదా? అన్నది ఉన్నతాధికారులే తేల్చాలి.

**'లాగిన్' ఎవరి చేతిలో..?**

అధికారి లేని సమయంలో ఆయన లాగిన్ ద్వారా లావాదేవీలు జరిగితే.. ఆ వివరాలు ఎవరి వద్ద ఉన్నాయి? పాస్‌వర్డ్, డిజిటల్ కీ భద్రతను ఎవరు చూసుకున్నారు? ఏ కంప్యూటర్ నుంచి లాగిన్ అయ్యారు? ఏ సమయంలో లావాదేవీలు జరిగాయి? ఎన్ని ధ్రువపత్రాలు జారీ అయ్యాయి? అన్నది సాంకేతిక రికార్డులు చెబుతాయి కదా. మరి ఆ రికార్డులను పరిశీలించేందుకు అధికారులకు అడ్డంకి ఏమిటి? తప్పేమీ జరగలేదంటే విచారణకు ఎందుకు వెనుకడుగు? తప్పు జరిగితే చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం? ప్రజలకు చిన్న నిబంధన ఉల్లంఘనకే జరిమానాలు విధించే రవాణా శాఖలో అధికారిక లాగిన్ విషయంలో మాత్రం ఇంత ఉదాసీనత ఎందుకు? అన్న ప్రశ్నలు రేకెత్తుతున్నాయి.

**డీటీవోపై వరుస వివాదాలు.. డీటీసీ నిఘా ఏది..?**

ములుగు రవాణా శాఖ కార్యాలయంలో డీటీవో వ్యవహారశైలిపై కూడా పలు అంశాలు చర్చకు వస్తున్నాయి. సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడం, దుర్భాషలాడటం, భయభ్రాంతులకు గురిచేయడం, నిబంధనలను పక్కనపెట్టి తాను చెప్పిన పని చెప్పినట్లే చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారన్న సమాచారం ఉంది. మరోవైపు సదరు అధికారికి సన్నిహితుడిగా భావిస్తున్న ఓ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఇసుక లారీల నుంచి అక్రమంగా వసూళ్లు చేస్తున్న వ్యవహారంలో డీటీవోకు వాటాలు వెళ్తున్నాయనే ప్రచారం కూడా ఉంది. ఈ అంశంపై తనిఖీ రికార్డులు, జరిమానాలు, వాహనాల వివరాలు, సిబ్బంది విధుల సమాచారాన్ని పరిశీలించారా? వసూళ్ల వ్యవహారంపై ఎప్పుడైనా విచారణ చేశారా? లేక ఫిర్యాదులు, కథనాలు వచ్చినా ఫైలు కదలదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**'కాకతీయ' వరుస కథనాలు..విచారణేది?**

ములుగు రవాణా శాఖలోని వ్యవహారాలపై 'కాకతీయ' ఆధారాలతో సహా వరుస కథనాలు ప్రచురించింది. అయినా డీటీసీ స్థాయిలో స్పష్టమైన స్పందన కనిపించకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది. కథనాలు తప్పయితే ఖండించండి.. వాస్తవాలుంటే విచారణ చేయండి.. మరి రెండూ చేయకుండా మౌనం ఎందుకు? అధికారిక లాగిన్ వినియోగం వంటి తీవ్రమైన అంశం బయటకు వచ్చినప్పుడు కనీసం రికార్డులు పరిశీలించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులకు లేదా? ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన శాఖే ప్రశ్నలకు దూరంగా ఉంటే.. ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? ఈ వ్యవహారంపై వివరణ తెలుసుకునేందుకు సంబంధిత ఉన్నతాధికారి డీటీసీని పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందన లభించలేదు. అధికారిక వ్యవహారంపై వివరణ కోరినప్పుడు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం కూడా చర్చకు దారితీసింది. డీటీసీ గారూ.. ప్రశ్నలకు సమాధానం చెప్పడం మీ బాధ్యత కాదా? ఫోన్ ఎత్తి వాస్తవం చెప్పడానికి ఎందుకు వెనుకాడుతున్నారో? ప ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత లేదా అన్న విమర్శలు డీటీసీపై వినిపిస్తున్నాయి.

**ప్రజల పన్నులతో జీతాలు.. జవాబుదారీ ఎక్కడ?**

ప్రజల పన్నులతో జీతాలు తీసుకునే అధికారులు ప్రజలకే జవాబుదారీగా ఉండాలి కదా. వాహనదారులకు నిబంధనలు చెప్పే ఆర్టీఏ అధికారులు తమ శాఖలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది కూడా ప్రజలకు తెలియాలి. నీతులు, నిబంధనలు జనాలకేనా? ఆర్టీఏ అధికారులకు వర్తించవా? అన్న ప్రశ్నకు డీటీసీ సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. వరుస కథనాలు, లాగిన్ వినియోగంపై వెలుగులోకి వచ్చిన వివరాలు, ఇసుక లారీల వ్యవహారంపై వస్తున్న సమాచారం నేపథ్యంలో ములుగు జిల్లా కలెక్టర్ కలుగజేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. డీటీవో ఈశ్వర్ సింగ్ ఠాకూర్ విధుల్లో లేని సమయంలో లాగిన్ వినియోగం, ధ్రువపత్రాల జారీ, డిజిటల్ సంతకం భద్రత, సిబ్బందితో వ్యవహారశైలి, ఇసుక లారీల తనిఖీలు, వసూళ్ల వ్యవహారం తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. హాజరు రికార్డులు, సిస్టమ్ లాగ్‌లు, ఐపీ వివరాలు, డిజిటల్ సంతకం వినియోగం, జారీ చేసిన ధ్రువపత్రాలు పరిశీలిస్తే అసలు విషయం బయటపడుతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా డీటీసీ స్పందిస్తారా? లేక మౌనంతోనే వ్యవహారాన్ని నెట్టుకొస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.




## మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ

- రసాయన విగ్రహాలతో జలవనరులకు నష్టం
- తక్కువ ఎత్తు మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి
- కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి వినాయక చవితికి మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. గురువారం కుడా కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో చెరువులు కలుషితమై జలచరాలు, పర్యావరణంపై ప్రభావం పడుతుందని గుండు సుధారాణి తెలిపారు. మట్టి గణపతులతో సంప్రదాయాన్ని కాపాడడంతో పాటు జలవనరులను పరిరక్షించవచ్చన్నారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ విగ్రహాల ఎత్తుపై పోటీ పడకుండా తక్కువ ఎత్తు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సామ్యా నాయక్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, పీసీబీ ఈఈ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శంకరపట్నంలో ఘనంగా చాకలి ఐలమ్మకు నివాళులు




**కాకతీయ, శంకరపట్నం:** వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం శంకరపట్నంలో మండల రజక సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అధ్యక్షుడు తాడిచెర్ల తిరుపతి ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ మార్కెట్ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, ఉపసర్పంచ్ దండు రాజేష్, డైరెక్టర్ కల్లెపెల్లి రాజయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, దండు కొమురయ్య, కల్లెపెల్లి క్రాంతికుమార్, రాసమల్ల శ్రీనివాస్, దండు సమ్మయ్య, కల్లెపెల్లి కిరణ్, దండు సాయిలు, పాండ్రాల మహేష్, శ్రీనివాస్, నిజానపు శివ పాల్గొన్నారు.

**22ఏ భూముల అక్రమాలపై విచారణ జరపాలి**

కాకతీయ, శంకరపట్నం: 22ఏ నిషేధిత భూముల జాబితా రూపకల్పనలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 22ఏ జాబితాలో జరిగిన తప్పిదాలు, అక్రమ చేర్పులపై విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండు కొమురయ్య, వంకాయగూడెం సర్పంచ్ వెన్నెం మల్లేశ్, దొంగల రాములు, జంగ జైపాల్, కొయ్యడ అశోక్, రాసమల్ల శ్రీనివాస్, బిజిలి సారయ్య, నరేష్, కనకం కుమార్, రాజు, పెసరి వీరార్జున్, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

- భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాటం
- అణగారిన వర్గాల హక్కులకు ఐలమ్మ ఆదర్శం
- సదాశివ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ దళపతి నివాళి

**కాకతీయ, నల్లబెల్లి :** భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సదాశివ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ దళపతి అన్నారు. నల్లబెల్లి మండల కేంద్రంలో గురువారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. రజక సంఘం అధ్యక్షుడు రాపాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ దళపతి పాల్గొన్నారు. ఐలమ్మ ధైర్యసాహసాలు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం అందరికీ ఆదర్శమన్నారు. ఆమె పోరాట చరిత్రను భావితరాలకు అందించేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన రజక సంఘం నాయకులను అభినందించారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలు పెద్ది మణిపాల్‌రెడ్డి, పెద్ది గణేష్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు నూతనకంటి ఆనంద్, డాక్టర్ ఫోనుగోటి గోపాల్, డాక్టర్ అలుగునూరి వినయ్‌కుమార్, పొదికి వసంత శోభన్, సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రకాశ్, ఉపసర్పంచ్ గుమ్మడి వేణు, తహసీల్దార్ ముప్పు కృష్ణ, కొల్లారి లక్ష్మీనారాయణ, చింతకింది కుమారస్వామి, భట్టు సాంభయ్య, కడం సమ్మయ్య, కడియం మనోహర్, మామిడాల నర్సయ్య, పొదిళ్ల రాంచందర్, సంగె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుమంత్‌ను విచారించిన పోలీసులు

- కొండా సురేఖ మాజీ ఓఎస్డీకి ప్రశ్నలు
- కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలపై ఆరా
- పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు



**కాకతీయ, హైదరాబాద్ :** కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌ను పోలీసులు గురువారం విచారించారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం. ఇటీవల నాంపల్లి కోర్టు సుమంత్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కోర్టు విధించిన షరతులకు అనుగుణంగా విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రశ్నించినట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో భాగంగా సుమంత్‌తో పాటు ఇతర నిందితుల కదలికలు, పరస్పర సంబంధాలపై పోలీసులు దృష్టి సారించారు. దాడి జరిగిన రోజు, అంతకుముందు రోజుల్లో సుమంత్, ఇతర నిందితులు ఎవరెవరితో మాట్లాడారన్న విషయంపై కాల్ డేటా రికార్డులను విశ్లేషిస్తున్నారు. గొంగడి హరికృష్ణతో ఉన్నట్లు చెబుతున్న రియల్ ఎస్టేట్ వివాదం, రూ.10 కోట్ల సెటిల్‌మెంట్‌కు సంబంధించిన పత్రాలు, ఆర్థిక లావాదేవీల ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసులో పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. చార్జ్‌షీట్ దాఖలుకు అవసరమైన సాక్ష్యాలను క్రోడీకరిస్తున్నారు. సుమంత్ విచారణతో కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

## రెండో విడతలో 59 వేల ఇందిరమ్మ ఇళ్లు

- రూ.5 లక్షల ఉచిత సాయం దేశంలో ఎక్కడా లేదు
- పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదలను జీవనోపాధికి దూరంగా 30-40 కిలోమీటర్ల దూరం తరలించే విధానం తమ ప్రభుత్వానికి లేదన్నారు. గురువారం శాసనసభలో ఇందిరమ్మ ఇళ్లపై ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, డ్రాలో ఎంపికైన వారిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందినవారు తేలితే పేర్లు తొలగిస్తామన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా**

దేశంలో పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని మంత్రి తెలిపారు. 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా ప్రభుత్వం భరిస్తోందన్నారు. రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 59 వేల గుడిసెలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. అసంపూర్తిగా నిలిచిన ఇళ్లకు కూడా రెండో విడతలో అవకాశం కల్పించామని, ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను వాటికి కేటాయించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లకు రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని, మౌలిక వసతులకు రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. పేదలకు 50 కిలోల సిమెంట్ బస్తాను రూ.230కే అందించేలా కంపెనీలతో ఒప్పందం పూర్తయిందన్నారు. డ్వాక్రా మహిళలకు ఇంటి నిర్మాణం కోసం రూ.లక్ష అడ్వాన్స్ ఇచ్చే అవకాశం కల్పించామని పొంగులేటి తెలిపారు.



## ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు
- రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** 2026-27 వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం డా. బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సీజన్‌లో 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో 65 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. గత సీజన్‌లో 70 లక్షల ఎకరాల్లో సాగు కాగా 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి, 71.86 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగిందని వివరించారు.

**కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి**

రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాలను ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఇతర ఏజెన్సీల సమన్వయంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్టోబర్‌లో ధాన్యం రాక ప్రారంభమై, నవంబర్‌లో భారీగా వచ్చే అవకాశం ఉన్నందున రవాణా, హమాలీలు, గోదాములు, నిల్వ సామర్థ్యంపై ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల వివరాల నమోదులో ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని, ఆధార్‌ను బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేయాలని అన్నారు. కొనుగోలు, రవాణా, నిల్వ, చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

## ఏసీబీకి చిక్కిన ఇద్దరు

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, సీనియర్ అసిస్టెంట్ పట్టివేత
- సీఎంఆర్‌ఎఫ్ బిల్లు మంజూరుకు లంచం డిమాండ్
- రూ.2 లక్షల మంజూరుకు రూ.1.05 లక్షలు డిమాండ్
- రూ.లక్ష తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు



**కాకతీయ, హైదరాబాద్ :** సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన వైద్య రీయింబర్స్‌మెంట్ బిల్లును ప్రాసెస్ చేసేందుకు రూ.లక్ష లంచం తీసుకుంటూ సచివాలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆనందేశి రాఘవేందర్, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ సీనియర్ అసిస్టెంట్ మెడి వినోద్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఫిర్యాదుదారుడి వైద్య రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌కు సంబంధించి రూ.2 లక్షలు మంజూరు చేయడంతో పాటు మిగిలిన బిల్లును ప్రాసెస్ చేసేందుకు ఈ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఇంతకుముందే రాఘవేందర్ రూ.5 వేలు లంచం డిమాండ్ చేసి మెడి వినోద్ ద్వారా ఫోన్‌పేలో స్వీకరించినట్లు ఏసీబీ వెల్లడించింది. గురువారం నిర్వహించిన ట్రాప్‌లో వినోద్ ఫిర్యాదుదారుడి నుంచి రూ.లక్ష తీసుకుని రాఘవేందర్‌కు అందజేశాడు. రాఘవేందర్ సూచన మేరకు అతడి వద్ద నుంచి లంచం మొత్తాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**నాంపల్లి ప్రత్యేక కోర్టులో హాజరు**

ఇద్దరూ విధులను దుర్వినియోగం చేసి అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితులను ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

# సంధ్యారావు సృష్టికర్త రేవంత్ రెడ్డే

- మాదిగలకు సీఎం క్షమాపణ చెప్పాలి
- డప్పును, మాదిగలను అవమానించారు
- బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు




**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** సంధ్యారావు అనే వ్యక్తిని సృష్టించింది ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డేనని, డప్పును.. మాదిగలను అవమానించినందుకు మాదిగలకు సీఎం క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మాదిగలు ఎవరి చావును కోరుకోరని, డప్పు..! మనిషి బతకాలని చెప్పే తమ సంస్కృతిలో భాగమని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంధ్యారావు ఎవరో, ఆమెను ఎవరు సృష్టించారో రాష్ట్ర ప్రజలు అన్వేషిస్తున్నారని అన్నారు. సంధ్యారావు పేరుతో మహిళ ఫొటో, పురుషుడి వాయిస్‌తో ఉన్న పోస్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. లక్షలాది సోషల్ మీడియా పోస్టులు ఉండగా.. ముఖ్యమంత్రికి సంధ్యారావు పోస్టే ఎలా దొరికిందని ప్రశ్నించారు. గత 3 రోజులుగా తెలంగాణ అబద్ధాలతో మునిగిపోయిందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సమస్యలు, 22ఏ, పాలిటెక్నిక్, రెవెన్యూ తదితర అంశాలపై మాట్లాడేందుకు అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకుని దాడులు చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల వద్ద పురుష పోలీసులను, పురుష ఎమ్మెల్యేల వద్ద మహిళా పోలీసులను పెట్టి వివాదాస్పద పరిస్థితులు సృష్టించారన్నారు. ఓ ఎమ్మెల్సీ ఆవేశంలో మాట్లాడిన మాటలను ఆధారంగా చేసుకుని దళితులను అవమానించారంటూ కేసులు పెట్టారని చెప్పారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కాంగ్రెస్ నాయకులే దళిత దళిత అంటూ అవమానించారని, ఆయన తల్లిని ఎవరూ ఏమీ అనలేదని అన్నారు. సీతక్క పదేపదే ఆ అంశాన్ని ప్రస్తావించి స్పీకర్‌ను బాధించారని విమర్శించారు. తాతా మధు నేరుగా స్పీకర్‌ను తిట్టలేదని పోలీస్ రిపోర్టే చెప్పిందని, కోర్టు కూడా కేసును కొట్టివేసిందన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి సూచనతోనే షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసీఆర్ చావు కోరుతూ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

### డప్పు.. మాదిగల ఆత్మగౌరవం

మాదిగలు ఎప్పుడూ మనిషి చావును కోరుకోరని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదిమ మానవుడి కాలం నుంచి ప్రమాదాల నుంచి రక్షణకు, సమాచారాన్ని చేరవేయడానికి డప్పు ఉపయోగపడిందన్నారు. పెళ్లిళ్లు, పోచమ్మ పండుగలు, చాటింపులు, చావులు, పోరాటాల్లో డప్పు భాగమైందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలోనూ లక్షలాది డప్పులు పెత్తందార్లకు వ్యతిరేకంగా మోగాయని, డప్పు తిరుగుబాటు బావుటా అని పేర్కొన్నారు. డప్పు తమ సంస్కృతి, ఆయుధం, ఆభరణమని అన్నారు. వేయి డప్పుల ర్యాలీకి వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తూంకుంట నరసా రెడ్డి, బీర్ల ఐలయ్య తదితరులు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. మాదిగలు ఎవరి చావునూ కోరుకోరని, రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని, వాటిని సుమోటోగా తీసుకుని విచారణ జరపాలని కోరారు. మాదిగలు, దళితులు, మహిళలకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన దళిత బంధు, 3 ఎకరాల భూ పంపిణీ, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కళ్యాణ లక్ష్మి, గురుకులాలు, సాంస్కృతిక సారథి వంటి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. 22ఏ పేరుతో ఎస్సీల భూములు లాక్కుంటున్నారని విమర్శించారు. డప్పు కళాకారులకు రూ.3 వేల పెన్షన్ ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# మిల్లుల్లో ఫిజికల్ వెరిఫికేషన్ ఆపాలి

- సీఎంఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- మిల్లర్‌ను నష్టాల్లోకి నెట్టి రైతుకు న్యాయం చేయలేరు
- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్




**కాకతీయ, ములుగు ప్రతినిధి :** మిల్లర్‌ను నష్టాల్లోకి నెట్టి రైతుకు న్యాయం చేయలేరని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఫిజికల్ వెరిఫికేషన్ పేరుతో మిల్లర్లను వేధించడం ఆపాలని, మిల్లింగ్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మిల్లర్లు నల్లబ్యాడ్జీలు ధరించి పాల్గొనగా, అంతకుముందు జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ధర్నా చౌక్‌లో ప్రవీణ్ మాట్లాడుతూ గత యాసంగి, వానాకాలం సీజన్లలో లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లింగ్ చేసి బియ్యం అందించామని, అయినా బకాయిలు, మిల్లింగ్ చార్జీలు పూర్తిగా విడుదల కాలేదన్నారు. పెరిగిన విద్యుత్, కూలీలు, హమాలీ, రవాణా ఖర్చులకు ప్రస్తుత మిల్లింగ్ చార్జీలు సరిపోవడం లేదన్నారు. 15-20 శాతం తరుగుదల, రికవరీపై క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ నిర్ణయం తీసుకోవాలని కోరారు. నాన్-ఎఫ్ఏక్యూ ధాన్యంతో క్వింటాల్‌కు రూ.750-1,000 వరకు అదనపు నష్టం వస్తోందన్నారు. సీఎంఆర్ బియ్యం సిద్ధంగా ఉంచినా సకాలంలో స్వీకరించకపోవడంతో నిల్వ, కూలీలు, విద్యుత్, వడ్డీ భారం పెరుగుతోందన్నారు. 2025-26 సీజన్ సీఎంఆర్ వివరాలను ప్రభుత్వం మిల్లువారీగా పారదర్శకంగా వెల్లడించాలని, డిమాండ్లు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సహోదరరెడ్డి, ఎలగందుల మోహన్, కొమురవెల్లి హరినాథ్, పల్లెపాటి సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వే పనులు వేగవంతం చేయాలి

- హద్దుల నిర్ధారణ పారదర్శకంగా చేపట్టాలి
- ప్రభుత్వ భూముల వివరాలు సక్రమంగా నమోదు చేయాలి
- ఆర్డీఓ గణేష్, తహసీల్దార్ చందా నరేష్ ఆదేశం



**కాకతీయ, నెల్లికుదురు:** భూ హక్కుదారులకు ఇబ్బందులు లేకుండా రీసర్వే పనులను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని తొర్రూర్ ఆర్డీఓ గణేష్, తహసీల్దార్ చందా నరేష్ సూచించారు. రామానుజాపురం గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను గురువారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్‌తో కలిసి వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూ హద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల గుర్తింపు, రీసర్వే పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో హద్దుల నిర్ధారణను పారదర్శకంగా చేపట్టాలని, గుర్తించిన ప్రభుత్వ భూములు, ఇతర ప్రభుత్వ ఆస్తుల వివరాలను సక్రమంగా నమోదు చేసి రికార్డులను నవీకరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు!

**వర్ధన్నపేట సీఐ వై.సంజీవరావు**

**కాకతీయ, రాయపర్తి:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వర్ధన్నపేట సీఐ వై.సంజీవరావు హెచ్చరించారు. గురువారం రాయపర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఆయన ఎస్సై ముత్యం రాజేందర్, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులతో మాట్లాడి ఉత్సవాల సందర్భంగా పోలీసులకు సహకరించాలని కోరారు. డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చి, అధిక శబ్దంతో డీజేలు నిర్వహిస్తే పరికరాలు జప్తు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీజే నిర్వాహకులను తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ వద్ద బౌండ్‌ఓవర్ చేయించారు. నిమజ్జన చెరువులను పరిశీలించి భద్రతా చర్యలు చేపట్టాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పొన్నం భాస్కర్, సిబ్బంది తూళ్ల సంపత్, అనిల్, నవ్య, సునీత, గణపతి రెడ్డి, డీజే సంఘం మండల అధ్యక్షుడు ఎండి అఫ్రోజ్ ఖాన్, నర్సింహుల మురళి, కృష్ణ, యాకన్న, శ్రీను, రాకేష్ పాల్గొన్నారు.

## రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలందించాలి

- ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత సమయంలో చేరుకోవాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజారెడ్డి



**కాకతీయ, నల్లబెల్లి:** రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజారెడ్డి ఆదేశించారు. గురువారం మేడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు, ఆసుపత్రి నిర్వహణను పరిశీలించారు. వివిధ రికార్డులను తనిఖీ చేసి వైద్య సేవల సూచికలు, ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల సాధనపై సిబ్బందితో సమీక్షించారు. ప్రతి విభాగం నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత సమయంలో చేరుకునేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో పొరపాట్లకు తావులేకుండా కచ్చితత్వం పాటించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని డాక్టర్ బి. రాజారెడ్డి సూచించారు.

## రాయపర్తిలో ఉచిత వైద్య శిబిరం

**కాకతీయ, రాయపర్తి:** గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. మెడికవర్ హాస్పిటల్ వైద్య నిపుణులు గ్రామంలోని నిరుపేదలు, వృద్ధులు, మహిళలకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మచ్చ రమేష్, పంచాయతీ కార్యదర్శి గుగులోత్ యాకుబ్ నాయక్, కారోబార్ కారుపోతుల రామచంద్రయ్య, సరికొండ కృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## జీవో 97ను వెంటనే రద్దు చేయాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- విద్యార్థులపై కళాశాలల ఒత్తిడి సరికాదు
- మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్




**కాకతీయ, హనుమకొండ:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. ఏకశిలా పార్కు వద్ద డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉన్నారని, నిధులు సకాలంలో విడుదల కాక విద్యార్థులు, తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బకాయిలతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయని తెలిపారు. జీవో 97తో పాలిటెక్నిక్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల హక్కుల కోసం చేపట్టే ప్రజాస్వామ్య పోరాటాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, విద్యార్థి నాయకుడు వీరస్వామి, బీసీ నాయకుడు తాడిచెట్టు క్రాంతి, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కొమ్మాల ఆర్చి వద్ద బస్సులు నిలపాలి

- భక్తులు, గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలి
- నర్సంపేట–వరంగల్‌కు ఉదయం, సాయంత్రం బస్సు నడపాలి
- సేవాలాల్ గోర్ బంజారా ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రాఘవేంద్ర డిమాండ్



**కాకతీయ, గీసుగొండ:** కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆర్చి వద్ద ఆర్టీసీ బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని సేవాలాల్ గోర్ బంజారా ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సూర్య తండ సర్పంచ్ బానోతు రాఘవేంద్ర కోరారు. ఈ మేరకు నర్సంపేట టీజీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై నడిచే ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులను ఆర్చి వద్ద నిలిపితే భక్తులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. సూర్య తండ, కొమ్మాల పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నర్సంపేట నుంచి సూర్య తండ, కొమ్మాల దేవస్థానం, కొమ్మాల గ్రామపంచాయతీ మీదుగా వరంగల్‌కు, తిరుగు ప్రయాణంలో అదే మార్గంలో నర్సంపేటకు ఉదయం, సాయంత్రం బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని మరో వినతిపత్రం అందజేశారు. రెండు వినతులపై సానుకూలంగా స్పందించి త్వరగా రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు.

## తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక

- అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి
- హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
- న్యూ శాయంపేట 31వ డివిజన్‌లో ఘనంగా బోనాలు



**కాకతీయ, హన్మకొండ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. న్యూ శాయంపేట 31వ డివిజన్‌లో గురువారం నిర్వహించిన పోచమ్మ బోనాల ఉత్సవాల్లో డివిజన్ మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్, వేల్పుల మోహన్‌రావు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 31వ డివిజన్ ప్రజలతో పాటు హనుమకొండ జిల్లా ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ, డీసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీ కన్వీనర్ మారంరెడ్డి కౌటిల్ రెడ్డి, వేల్పుల రోహిత్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

- భూమి, భుక్తి, విముక్తి కోసం ఆమె పోరాటం చిరస్మరణీయం
- తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు ఐలోని అభిషేక్ పిలుపు



**కాకతీయ, గీసుగొండ :** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఐలోని అభిషేక్ పిలుపునిచ్చారు. ఎలుకుర్తి హవేలీ గ్రామంలో దత్తాత్రేయ మడేలేశ్వర స్వామి రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని ఐలోని అభిషేక్ అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు రజక సమాజం హక్కులు, అభివృద్ధి కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుల సంఘం పెద్దమనిషి ఐలోని సత్యనారాయణ, ఐలోని మల్లేశం, రాయరాకుల రాజు, ఐలోని తిరుపతి, ఐలోని మహేష్, ఐలోని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

- వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారు
- కాంగ్రెస్ పెద్దవంగర మండల అధ్యక్షుడు రంగు మురళి గౌడ్



**కాకతీయ, పెద్దవంగర :** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రంగు మురళి గౌడ్ అన్నారు. గురువారం పెద్దవంగర మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ దొరల దౌర్జన్యాలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని రంగు మురళి గౌడ్ కొనియాడారు. ఆమె ధైర్యం, తెగువ, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు సంకపల్లి రవీందర్ రెడ్డి, సిరి శ్రీనివాస్, కొండ్రతి శ్రీనాథ్, కొమరమల్లు, వెంకటేష్, లింగమూర్తి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## రజకులు ఐక్యంగా హక్కుల సాధనకు కృషి చేయాలి

**రజక సంఘం ఏటూరునాగారం మండల అధ్యక్షుడు పర్వతాల ఎల్లయ్య**



**కాకతీయ, ఏటూరునాగారం, రూరల్:** అణగారిన వర్గాల హక్కుల కోసం వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ చేసిన పోరాటం, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని రజక సంఘం అధ్యక్షుడు పర్వతాల ఎల్లయ్య అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పర్వతాల ఎల్లయ్య పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో రజకులు ఐక్యతను చాటుతూ హక్కుల సాధనకు సంఘటితంగా ముందుకు సాగాలని కోరారు. రజకుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం చైతన్యంతో ఉద్యమాలను బలోపేతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కుదురుపాక రాజేష్, పర్వతాల కుమారస్వామి, పర్వతాల నర్సయ్య, చింతలపల్లి సుమన్, పర్వతాల రమేష్, రమేష్ (పెద్దోడు), కుమ్మరికుంట్ల సతీష్, కుదురుపాక గిరిబాబు, పర్వతాల రత్తమ్మ, వార్డు సభ్యులు అంగాల వీరన్న, గంప సాయి కిరణ్, పెద్దబోయిన బాలకృష్ణ, బట్టు గోపి, కూనూరు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## 144 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ




**కాకతీయ, నెల్లికుదురు :** గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు సర్పంచ్ మాదరి ప్రశాంత్ తెలిపారు. జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయిరాం హాస్పిటల్స్ సహకారంతో గురువారం నిర్వహించిన శిబిరాన్ని సర్పంచ్ మాదరి ప్రశాంత్, ఉపసర్పంచ్ రామగిరి సుమన్ తదితరులతో కలిసి ప్రారంభించారు. శిబిరానికి అనూహ్య స్పందన లభించిందని, వివిధ వ్యాధులకు సంబంధించి 144 మందికి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



**కాకతీయ, ఏటూరునాగారం రూరల్ :** రెవెన్యూ పట్టా, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులకు ప్రభుత్వం అందించే ఎరువులు, రైతు సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. మండలంలోని పట్టాదారు రైతులందరూ తమ ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్‌తో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

## చిన్నారి చికిత్సకు దాతలే దిక్కు

- విద్యుత్ ప్రమాదంలో జీవితం అతలాకుతలం
- రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చు



**కాకతీయ, హనుమకొండ:** ఇంటిపై ఆడుకుంటుండగా 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడిన 11 ఏళ్ల చిన్నారి అభికరుణ్ ప్రస్తుతం హైదరాబాద్ హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సెప్టెంబర్ 4న జరిగిన ఈ ఘటనతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది. వైద్యుల సూచనల మేరకు మరో 2-3 నెలలు చికిత్స అవసరమని, ఇందుకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న చిన్నారి తండ్రికి అందుబాటులో ఉన్న ఉద్యోగుల ఆరోగ్య పథకం కార్డు ప్రస్తుతం ఉపయోగపడకపోవడంతో వైద్య ఖర్చులు భరించడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగం ద్వారా వచ్చే ఆదాయంపైనే ఆధారపడుతున్న కుటుంబానికి భారీ వ్యయం భారంగా మారిందని తెలిపారు. చిన్నారి చికిత్స కొనసాగించేందుకు దాతలు, మానవతావాదులు ఆర్థిక సహాయం అందించాలని తల్లిదండ్రులు వేడుకున్నారు. సహాయం చేయదలచిన వారు 8520942727 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266